క్లుప్తంగా

రత్నాలచెరువు కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

మంగళగిరి: నగరంలోని రత్నాల చెరువు కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పర్యటించారు. ఆయన నగర పాలక సంస్థ అధికారులతో కలసి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. రత్నాల చెరువు ప్రాంతంలో నూతనంగా నిర్మాణం కానున్న ఫ్రెజర్ శాండ్ ఫిల్టర్ గురించి నగర పాలక సంస్థ అధికారులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రెజర్ శాండ్ ఫిల్టర్ నిర్మాణం పూర్తిచేసి నిర్ణీత సమయంలో రత్నాల చెరువు ప్రాంత వాసులకు తాగునీరును సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రు ఎస్సీ కాలనీ, శివాలయం ఏరియాలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



మంగళగిరి: దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామానికి చెందిన పేద ముస్లిం కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ మేరకు మంగళవారం దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజిల చేతుల మీదుగా ఎమ్మెల్యే ఆర్కే పంపిన రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డీవీఆర్, రజనీకాంత్, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు తపస్సుకాల ప్రార్థనలు ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో బుధవారం నుంచి తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభించనున్నట్లు దేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విభూదిని అందజేస్తామన్నారు. తపస్సుకాలంలో భక్తులు మాలలు ధరిస్తారని 45రోజులు పాటు దీక్షలోఉంటూ ఉపవాసాలు పాటిస్తూ సేవా హృదయంతో మెలుగుతారని చెప్పారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహిస్తామన్నారు.

24 గంటల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



మంగళగిరి: నగరంలోని జగనన్న కాలనీ టిడ్కో గృహ సముదాయం వద్ద 24 గంటల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) రెండున్నర గంటల పాటు టిడ్కో గృహ సముదాయంలోని ప్రతి బ్లాకును సందర్శించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్న విషయం విదితమే. వీధి లైట్లు లేక చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు మహిళలు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు 24 గంటల్లోపే విద్యుత్ స్తంభాలను, వీధిలైట్లను ఏర్పాటు చేశారు. తమ సమస్యను చెప్పిన 24 గంటల్లో పరిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కేకు, విద్యుత్ శాఖ అధికారులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అంబేడ్కర్ విగ్రహానికి శంకుస్థాపన

తాడికొండ: తాడికొండ పోలీస్‌స్టేషన్ కూడలిలో నూతనంగా ఏర్పాటు చేయ తలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు నిర్మాణ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ పాల్గొని భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ఈనెల 26న పెండ్లి కుమారునిగా నృసింహుడు
- మార్చి 5న పొన్న వాహనం ఊరేగింపు
- 6న కల్యాణ మహోత్సవం
- 7న దివ్య రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేస్తున్న అధికారులు



గాలి గోపురం (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారు

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సర్వం సన్నద్ధం అవుతున్నాయి. ఈనెల 26వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మహిమగల మంగళాద్రి నృసింహుడు భక్తులకు 26వ తేదీ పెండ్లి కుమారుని ఉత్సవంలో దర్శనం ఇవ్వనున్నారు. అనంతరం 27వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. 28న హనుమంత వాహనం, మార్చి 1వ తేదీ రాజాధి రాజ వాహనం, 2న యాలి వాహనం, 3న సింహ వాహనం, 4న హంస వాహనం, అదే రోజు రాత్రి గజ వాహనంపై శ్రీదేవి , భూదేవి సమేత శ్రీవారు పుర వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. 5న ఉదయం కల్పవృక్ష వాహనం, అదే రోజు రాత్రి 7 గంటలకు పొన్న వాహనం, 6న అశ్వ వాహనం, 7న బంగారు గరుడోత్సవం నిర్వహించనున్నారు. 7న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీవారి దివ్య రథోత్సవం వైభవంగా జరుగనుంది. వేల సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో ఈఓ రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. 8న చక్రవారి చూర్ణోత్సవం, వసంతోత్సవం, 9వ తేదీ శ్రీ పుష్ప యాగోత్సవం నిర్వహించనున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

వివిధ ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు తరలిరానున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు క్యూలైన్లతోపాటు తాగునీరు, మజ్జిగ అందించడంతో పాటు అన్న ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తునికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దైవ దర్శనంతోపాటు ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆర్కే సూచించిన నేపథ్యంలో అధికారులు బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

ఎమ్మెల్యే ఆర్కేకు వినతి



ఎమ్మెల్యే ఆర్కేకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ చేనేత కార్మిక సంఘం నేతలు

మంగళగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కేను నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం తరువాత అత్యధిక పెద్ద రంగం చేనేత రంగమని, ఈ రంగంలో అత్యధిక మంది ఉపాధి పొందుతున్నారని ఏపీ చేనేత కార్మిక సంఘ నేతలు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగానూ, పరోక్షంగా మరో రెండు లక్షల మంది ఉప వృత్తుల వారు ఉపాధి పొందుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం గత రాష్ట్ర బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించిందని, ఈ నిధులు నేతన్ననేస్తం పథకానికే సరిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల 2023- 24 రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే ఆర్కే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి డి రామారావు, జిల్లా కమిటీ సభ్యులు జె శివ భవన్నారాయణ, ఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో అధికారుల పర్యటన

మేడికొండూరు: మండల పరిధిలోని డోగిపర్రు గ్రామంలో గల జగనన్న కాలనీలో లే–అవుట్‌లను గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ ఎస్‌ఈ బ్రహ్మయ్య, గుంటూరు జిల్లా హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఎస్‌ఈ బ్రహ్మయ్య మాట్లాడుతూ డోగిపర్రు గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ లే–అవుట్‌కు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాల పనులను తెలుసుకుని పలు సూచనలు చేశారు. దీనిలో భాగంగా గ్రామంలో నుండి లే–అవుట్‌కు వచ్చే మార్గం అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాల గురించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి శోభారాణి, హౌసింగ్ ఏఈ దివ్య, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఏఈ వరప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్, అధికారులు పాల్గొన్నారు.

నగరంలో బస్ షెల్టర్ల ఏర్పాటుకు కృషి

- ప్రయాణికుల ఇబ్బందులను తీర్చేందుకే బస్‌షెల్టర్లు
- సీఎం క్యాంప్ మార్గంలో బీటీ రోడ్డు విస్తరణ
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- బస్ షెల్టర్లను ఏర్పాటు చేయనున్న కూడళ్ల పరిశీలన



బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయనున్న కూడలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

మంగళగిరి: నగర ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలనే ఉద్దేశంతో జాతీయ రహదారి వెంబడి ఆయా ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. మంగళవారం ఆయన నగరపాలక సంస్థ, పోలీస్‌శాఖ అధికారులతో కలసి పర్యటించారు. తొలుత తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి ఎదుట జాతీయ రహదారి సర్వీసు రోడ్డు వెంబడి నగరపాలక సంస్థకు చెందిన స్థలంతోపాటు కుంచనపల్లి బైపాస్ రోడ్డు వరకూ సర్వీసు రోడ్డు వెంబడి స్థలాలను పరిశీలించారు. అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయం రోడ్డు వెంబడి గల కాలువను పరిశీలించారు. సమీపంలోని పంట పొలాల్లో ఉన్న పాత ఇనుప సామాన్లు, చిత్తు పేపర్ల దుకాణాన్ని పరిశీలించి రెండు మూడు రోజుల్లో దుకాణాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్డు వెంబడి పెరిగిన చెట్ల కొమ్మలు ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారడాన్ని గమనించిన ఎమ్మెల్యే ఆర్కే రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలు తొలగించాలని సూచించారు. సీఎం క్యాంప్ మార్గంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి రహదారికి ఇరువైపులా మట్టి కనపడటానికి వీలు లేదని, సీఎం క్యాంప్ కార్యాలయ మార్గంలో డ్రెయిన్ టూ డ్రెయిన్ బీటీ రోడ్డు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వీలైనంత త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం అక్కడి నుంచి మంగళగిరి ఆరవ ఏపీఎస్పీ బెటాలియన్ రోడ్, ఆత్మకూరు బైపాస్ రోడ్, ఎన్నారై ఆసుపత్రి వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. రోడ్డు వెంబడి టిఫిన్ సెంటర్లలో నిషేధిత ప్లాస్టిక్ పేపర్లు వినియోగించడాన్ని గుర్తించిన ఎమ్మెల్యే ఆర్కే ఇకపై టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు అరటి ఆకులను మాత్రమే వినియోగించాలని సూచించారు. వ్యర్థాలను డ్రెయిన్‌లో పడవేయరాదని వ్యాపారులకు సూచించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలో పెరిగిపోతున్న వాహనాలను దృష్టిలో ఉంచుకోవడంతోపాటు ప్రయాణికుల ఇబ్బందులను తీర్చాలనే ఉద్దేశంతో మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో జాతీయ రహదారి వెంబడి సుమారు 15 బస్ షెల్టర్లను రానున్న నెల రోజుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైతే నేషనల్ హైవే ప్రాజెక్ట్ అధికారుల సహకారాన్ని కూడా కోరతామని, లేకుంటే దాతల సహకారంతో గానీ, కార్పొరేషన్ ఆధ్వర్యంలో గానీ బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి, నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ జె రాంబాబు, నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఏఈ కిషోర్, తాడేపల్లి సీఐ శేషగిరిరావులతో వైఎస్సార్ సీపీ నాయకులు ఈదులమూడి డేవిడ్‌రాజు, బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, సంపూర్ణ శివపార్వతి పాల్గొన్నారు.

ఫిష్ ఆంధ్రా పథకంతో మత్స్యకారులకు మెరుగైన ఉపాధి

మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సదుద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫిష్ ఆంధ్రా పథకాన్ని రూపకల్పన చేశారని, చేప ఉత్పత్తులు విక్రయించే వారు శాశ్వతంగా తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఫిష్ ఆంధ్రా పథకం ద్వారా ఆక్వా ఉత్పత్తులను వినియోగదారులకు తక్కువ ధరకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఏర్పాటు తగు ఏర్పాట్లు చేస్తుందన్నారు. దుకాణాలు ఏర్పాటు చేసే స్థాయిని బట్టి బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు. ఫిష్ ఆంధ్రా పథకానికి దరఖాస్తు చేసుకున్న పలువురు మత్స్యకారులకు తెనాలి రోడ్డులోని రక్షిత మంచినీటి పథకం ఆవరణలోనూ, సీతానగరం కృష్ణానది ఒడ్డున దుకాణాలను ఏర్పాటు చేసుకోవచ్చని, దుకాణాలకు అవసరమైన విద్యుత్, తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ యు శారదాదేవి, జిల్లా మత్స్యశాఖ అధికారి వీవీఆర్ బాబు, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ప్రసాద్, గ్రామ మత్స్యశాఖ సహాయకులు అనిల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా పశ్చిమ కాలువకు మరమ్మతులు

మంగళగిరి: దుగ్గిరాల మండలం మోరంపూడి రోడ్డు పేరుకలపూడి కృష్ణా పశ్చిమ మెయిన్ కాలువ అంచున్న ఉన్న చానల్ హెడ్ స్లూయిస్ వద్ద మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి మంగళవారం మరమ్మతు పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ స్థానిక రైతు సోదరుల ద్వారా సోమవారం కృష్ణా పశ్చిమ మెయిన్ కాలువ హెడ్ స్లూయిస్ వద్ద పెద్ద గొయ్యి ఏర్పడిందని విషయం తెలుసుకున్న తాను సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతు పనులు పూర్తి చేయించడం జరిగిందని, శాశ్వత మరమ్మతులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని కోరారు. దుగ్గిరాల మండలంలో గత వేసవి కాలంలో తన సొంత ఖర్చులతో రైతుల కోసం డొంకరోడ్ల మరమ్మతులు చేపట్టానని, ఈ వేసవిలో కాలువ కట్టల మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఆర్కే తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఇరిగేషన్‌శాఖ అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో షిరిడిసాయిబాబా మందిరం 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీదేవి ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ చిగురుపాటి వీరభద్రయ్యకు ఎమ్మెల్యే శ్రీదేవి సూచించారు. ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్న, వైస్ ఎంపీపీ రాజశేఖర రెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, సిరిపురం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నికుల క్షత్రియులకు ఎమ్మెల్సీ కేటాయించాలి

మంగళగిరి: అగ్నికుల క్షత్రియులకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లేటి బాబూరావు కోరారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇచ్ఛాపురం నుంచి తడ వరకు తీర ప్రాంత వెంబడి సుమారు 40 లక్షల జనాభా నివసిస్తున్నారని అన్నారు. 10 నియోజకవర్గాల్లో ప్రత్యక్షంగా, 50 నియోజకవర్గాల్లో పరోక్షంగా గెలుపు ఓటములు శాసించగలిగిన స్థాయిలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో అగ్నికుల క్షత్రియులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో అగ్నికుల క్షత్రియులకు కనీసం ఒక్క ఎమ్మెల్సీ పదవినైనా కేటాయించాలని కోరారు. అగ్నికుల క్షత్రియ పల్లవసేన రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథపల్లి నాగ సుందరం, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మోపిదేవి శివనాగరాజు, కృష్ణాజిల్లా అధ్యక్షులు వాడపల్లి అర్జునరావు, కార్యదర్శులు పితా నాగేంద్రకుమార్, టి.అశోకచక్రవర్తి, రాష్ట్ర ప్రచారకార్యదర్శి కె.నాగబాబు పాల్గొన్నారు.

ఆధునిక ప్రపంచంలో క్లౌడ్ కంప్యూటరింగ్‌కు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఆచార్య డి రాజా చిలకపాటి

మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న బాలికలకు ఈనెల 20వ తేదీ నుంచి నిర్వహించిన క్లౌడ్ టెక్నాలజీ అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విభాగం సహకారంతో అమెజాన్ వెబ్ సర్వీస్ ద్వారా స్కిల్ అభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ క్లౌడ్ సంస్థ ఎడబ్ల్యూఎస్ ప్రతినిధి ఆచార్య డి రాజా చిలకపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంతర్జాతీయంగా ఎంతో డిమాండ్ ఉన్న క్లౌడ్ టెక్నాలజీ పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు క్లౌడ్ నైపుణ్యం పెరుగుతుందన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో క్లౌడ్ కంప్యూటరింగ్ ప్రాముఖ్యతను వివరించారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు క్లౌడ్ నైపుణ్యం ఉన్న వారికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈవిధమైన కార్యక్రమాల ద్వారా పాఠ్యాంశాలపై విద్యార్థినుల జ్ఞానాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కెరీర్‌లో కూడా ఎంతగానో సహాయపడుతుందన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో స్కిల్ అభివృద్ధి విభాగం, ఎడ్యూస్కిల్‌తో పాటు అద్భుతమైన అనుబంధం కలిగి ఉన్న కారణం చేత వివిధ విభాగాల్లో విద్యానంతరం విద్యార్థులకు నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాల కల్పనలో సహాయపడుతుందన్నారు. ఈ సదస్సు అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు వివిధ స్థాయిల్లో ఎడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ పరీక్షలు నిర్వహించినట్లు స్కిల్ అభివృద్ధి డీన్ డాక్టర్ ఎ శ్రీనాథ్ తెలిపారు. 30 మందికిపైగా అధ్యాపకులు, విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థులు వివిధ స్థాయిల్లో గ్లోబల్ సర్టిఫికెట్‌లు పొందడం విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక మైలు రాయి అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ, ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ జగదీష్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రామకృష్ణ, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సుబ్రమణ్యం, డాక్టర్ టి పవన్ కుమార్, డాక్టర్ రూత్ రమ్య, డాక్టర్ శ్యామ్, డాక్టర్ పి రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద కొండ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు



కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్, సర్వే అధికారులు

బడేపురం(తాడికొండ): తాడికొండ శివారు బడేపురం గ్రామంలో వివాదాస్పద కొండ ప్రాంతాన్ని మంగళవారం మైనింగ్, సర్వే అధికారులతోపాటు పలువురు జిల్లా అధికారులు పరిశీలించారు. కొండ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు ఇరు వర్గాలతో కలిసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీలకు చెందిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని వచ్చిన ఫిర్యాదు మేరకు వారి వద్ద ఉన్న సంబంధిత పత్రాలను పరిశీలించారు. అనంతరం అధికారుల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించిన అధికారులు హద్దులకు జెండాలను పాతి మార్కింగ్ చేసుకున్నారు. ఆలయాలకు సంబంధించి రహదారి విషయంలో వచ్చిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారిన నేపథ్యంలో సున్నితమైన అంశం కావడంతో ఇరువర్గాలు సంయమనం పాటించాలని సూచించారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేసి వారం రోజుల్లోగా సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మైన్స్ అండ్ జియాలజీ ఏడీ డీవీ రంగకుమార్, సర్వే శాఖ ఏడీ రూప్లానాయక్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, లాం అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ పులిపాటి అనీల్ పాల్గొన్నారు.

సీఆర్డీఏ పరిధిలో వలంటీర్లకు భృతి అందించాలి

సీఆర్డీఏ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



సీఆర్డీఏ కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

తాడికొండ: సీఆర్డీఏ పరిధిలో వలంటీర్లుగా పనిచేస్తున్న వారికి రాజధాని ప్రాంతంలో అందించే నిరుపేద భృతి రూ.2500 అందించాలని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఏపీ సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్‌ను కోరారు. మంగళవారం కమిషనర్‌ను కలిసిన ఆమె సీఆర్డీఏ పరిధిలోని వలంటీర్లకు నిరుపేద పరిహార భృతి అందడం లేదని, ఇక్కడ జీవనోపాధి కరువవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిరుపేద పరిహార భృతి అందితే ఆయా కుటుంబాల జీవనానికి ఉపయోగపడుతుంది కనుక సమస్య పరిష్కరించాలని సూచించారు. స్పందించిన కమిషనర్ వివేక్ యాదవ్ వచ్చే నెల నుంచి సీఆర్డీయే పరిధిలోని వలంటీర్లకు నిరుపేద పరిహార భృతి అందిస్తానని తెలిపినట్లు ఆమె తెలిపారు.

వైఎస్సార్ పశుసంచార అంబులెన్స్‌తో రైతులకుమేలు



వైఎస్సార్ పశుసంచార అంబులెన్స్ వాహనం

ఫిరంగిపురం: డాక్టర్ వైఎస్సార్ పశుసంచార అంబులెన్స్ వాహనంతో మండలంలోని పలు గ్రామాల పాడిరైతులకు ఎంతో ఉపకరంగా ఉంటుందని పశు వైద్యాధికారి కోటిరత్నం అన్నారు. పశువైద్యశాలలో మంగళవారం ఆమె మాట్లాడుతూ పశుసంచార వాహనాలు రెండు కేటాయించారని చెప్పారు. మేడికొండూరు, ఫిరంగి పురం మండలాలకు కలిపి ఒక వాహనం ఏర్పాటు చేశారని స్థానిక పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. పశువుకు అనారోగ్యంగా ఉండి ఇబ్బంది పడుతున్న రైతులు 1962 నెంబర్‌కు ఫోన్‌చేసి రైతుపేరు, గ్రామం, మండలం, పశువు అనారోగ్య లక్షణాలు తెలిపితే వాహనం ఆ ప్రాంతానికి వచ్చి తగిన రక్త, మూత్ర పరీక్షలు చేసి తగిన చికిత్స అందిస్తారన్నారు. మెరుగైన చికిత్స కోసం స్థానిక పశువైద్యశాలలో కానీ లేదా గుంటూరులోని ప్రధాన పశువైద్యశాలకు అదే వాహనంలో తీసుకెళ్లి చికిత్స అనంతరం స్వస్థలానికి తీసుకువస్తారని, ఈ వాహనాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు.

24 వరకు సంజీవయ్యనగర్ రైల్వే గేటు మూసివేత



చర్యల్లో భాగంగా చేపట్టిన పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ కీర్తి చేకూరి కోరారు.

నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల వలన ఈ నెల 24వ తేదీ వరకు సంజీవయ్యనగర్ రైల్వే గేటు మూసివేశారు. నెహ్రూనగర్ నుంచి సంజీవయ్య నగర్‌కు వెళ్లే వాహనాలు మూడు వంతెనల మీదుగా, రెడ్డిపాలెం నుంచి వచ్చే వాహనాలు శారదా కాలనీ మెయిన్ రోడ్ మీదుగా వెళ్లేలా ట్రాఫిక్ మళ్లించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని, నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రాయపూడి(తాడికొండ): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాలు ఆడపిల్లకు, 21 సంవత్సరాలు మగ పిల్లలకు నిండకుండా వివాహం జరిపిస్తే శిక్ష తప్పదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డి సునీత అన్నారు. బాల్య వివాహాలపై రాయపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం జరిపిస్తే వారికి 2 సంవత్సరాల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిపిస్తే 1098 నంబరుకు ఫోన్‌చేసి అరికట్టాలని సూచించారు. పలువురు అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

26న సంగీత కళావేదిక వార్షికోత్సవం

పాత గుంటూరు: భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వార్షికోత్సవం ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో జరిగే సినీ సంగీత విభావరి అనంతరం ఎంఈఓ చీకటి రవికాంత్‌కు ఉత్తమ ఎంఈఓ పురస్కారం, డాక్టర్ కోనేరు సుధాకర్‌కు ఎన్‌టీఆర్ జీవిత సాఫల్య పురస్కార ప్రదానం చేయనున్నటు పేర్కొన్నారు.